మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట





మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న అనిరుధ్ రెడ్డి

## ఉదండాపూర్ నిర్వాసితులకు
# కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
### జడ్చర్ల అనిరుధ్ రెడ్డి డిమాండ్

**జడ్చర్ల, డిసెంబరు 26 ప్రభాతవార్త :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై మెసలి కన్నీరు కారుస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉదండాపూర్ నిర్వాసితులకు క్షమాపణ చెప్పిన తర్వాతనే పాలమూరులో సభ పెట్టాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేసారు. పాలమూరు ప్రాజెక్టుపై ఆందోళనలు చేస్తామని, భారీ బహిరంగ సభను కూడా నిర్వహిస్తామని కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడిన అనిరుధ్ రెడ్డి పాలమూరు ప్రాజెక్టు ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు అప్పట్లో సీఎంగా ఉన్న కేసీఆర్ ను కలవబోతే వారిని కలవకపోగా ఎందుకు అరెస్టు చేయించి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పెట్టించారని ప్రశ్నించారు. కేసీఆర్ తాను కుర్చీ వేసుకొని కూర్చొని ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినా ఆ తర్వాత ఈ ప్రాజెక్టును గాలికి వదిలేసారని విమర్శించారు. గతంలో నార్లాపూర్‌కు వెళ్లి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయిపోయిందని ప్రకటించిన కేసీఆర్ ఇప్పుడు ప్రాజెక్టులో 70శాతమే పూర్తయిందని, మరో 30 శాతం పనులు కాలేదని ఇప్పుడు మాట ఎందుకు మార్చారని అనిరుధ్ రెడ్డి నిలదీసారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీటి నిల్వను పెంచుకోవడానికి 32 వేల కోట్ల రుపాయలను కేసీఆర్ కేటాయించారని గుర్తు చేసారు. కేసీఆర్ కు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై నిజంగా ప్రేమ ఉంటే కాళేశ్వరానికి అదనపు టీఎంసీ కోసం ఇచ్చిన 32 వేల కోట్ల రుపాయలు ఉదండాపూర్ రిజర్వాయర్ కు, పాలమూరు ప్రాజెక్టుకు ఇచ్చి ఉంటే పాలమూరు ప్రాజెక్టు పూర్తయి ఉండేది కాదా? అని ప్రశ్నించారు. అందుకే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై మాట్లాడడానికి కేసీఆర్ పాలమూరుకు రావడానికి ముందే ఉదండాపూర్ నిర్వాసితులకు క్షమాపణ చెప్పాలని అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేసారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని దశలవారీగా చెల్లించడంతో పాటుగా పరిహారం మొత్తాన్ని అదనంగా రూ.145 కోట్లకు పెంచారని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్ల కోసమే పాలమూరు ప్రాజెక్టును గాలికి వదిలేసిన కేసీఆర్ ఉదండాపూర్ నిర్వాసితులకు, పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతనే ఇక్కడ సభ పెట్టాలని అనిరుధ్ రెడ్డి పునరుద్ఘాటించారు.




సర్పంచులకు మెమెంటోలు, ప్రిసైడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన రెడ్డి

## గ్రామాల అభివృద్ధితోనే
# గ్రామ రాజ్యం ఏర్పాటు

- రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా గద్వాల నియోజక వర్గ
- గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలి
- నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలకులకు
- సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణ మోహన రెడ్డి

**గద్వాల, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అప్పుడే మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ రాజ్యం సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గద్వాల పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పచులకు, ఉప సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మాన –మిగతా4లో..

## గద్వాల జిల్లాల్లో 11శాతం తగ్గిన క్రైమ్ రేట్

- సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు
- వార్షిక మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** గద్వాల జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది క్రైమ్ రేట్ తగిందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు తెలిపారు. సైబర్ నేరాలను తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వ హించిన వార్షిక మీడియా సమావేశంలో 2025 సంవత్సరానికి సంబంధించిన జిల్లా పోలీస్ వార్షిక నివేదికను ఆయన విడుదల – మిగతా4లో..




## నడిగడ్డకు
# మంచి రోజులు..

- కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం
- గద్వాల, మల్దకల్‌లో స్థల పరిశీలన చేసిన కేంద్ర బృందం
- ఫలించిన ఎంపీ అరుణమ్మ కృషి హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న కేంద్రబృందం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 26 ప్రభాతవార్త:** అక్షరాస్యతలో వెనుకబాటుతనానికి గురైన జోగులాంబ గద్వాలజిల్లాకు మంచిరోజులు రానున్నాయని చెప్పవచ్చు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అరుణమ్మ కృషితో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం బృందం స్థల పరిశీలన చేసింది. అతి త్వరలోనే భవన నిర్మాణానికి అడుగులు పడుతుండడంతో నడిగడ్డ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కేంద్రం ఆధ్వర్యంలో...**

కేంద్రీయ విద్యాలయం అనేది భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే కేంద్ర ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ, ఇది ముఖ్యంగా బదిలీ అయ్యే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల కోసం స్థాపించబడింది. జాతీయ సమగ్రతను పెంపొందించడం, నాణ్యమైన విద్యను అందించ డం దీని ముఖ్య లక్ష్యం. ఇది సీబీఎస్ఈతో అనుబంధం కలిగి ఉంటుంది. దేశవ్యాప్తంగా, అలాగే విదేశాలలో కూడా విస్తరించి ఉండడంతో ఉన్నత విద్యా ప్రమాణాలు పెరుగనున్నాయి.

**పార్లమెంట్లో ప్రస్తావన..**

జోగులాంబ గద్వాల జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఆవశ్యకతను పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ అరుణమ్మ గొంతెత్తి చాటారు. ఈ ఏడాది మార్చి 12న పార్లమెంట్ సమావేశాలలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటును –మిగతా4లో..

**విద్యాభివృద్ధికి కృషి చేస్తాం..**



విద్యాభివృద్ధిలో గద్వాల కొంత వెనుకబాటు తనానికి గురైన విషయం తెలిసినదే. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయబోతున్నాం. విద్యాపరంగా ఒక ముందడుగు పడనుంది. ఇక్కడ వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలు సైతం కేంద్ర విద్యాలయంలో చదువుకోవడానికి మార్గం సుగమం అవుతుంది. ఉన్నత స్థాయి విద్యా ప్రమాణాలు మెరుగు పడతాయి. నడిగడ్డలో విద్యా ప్రాముఖ్యత ఆవశ్యకత గురించి పార్లమెంట్లో ప్రస్తావించాను. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నందుకు ప్రధాని మోడీకి కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

*బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ*



గద్వాల నియోజకవర్గం గట్టు మండలం రాయపురం గ్రామంలో గోకరమయ్య ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన గిరక బండ్ల పోటీలను బిఆర్‌యస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు ప్రారంభించారు. –వివరాలు2లో..

## పాలమూరు@8 డిగ్రీలు

- ఉమ్మడి జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- నాలుగు జిల్లాల్లో సింగిల్ డిజిట్
- కనిష్ట స్థాయికి టెంపరేచర్
- పొంగమంచుతో ఇబ్బందులు

4



## ప్రతి కార్యకర్త వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

● బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతకుమార్ 3

# తగ్గిన నేరాలు.. ప్రమాదాలు

- పోలీసుల పనితీరు భేష్
- ప్రజాభద్రతే లక్ష్యంగా ముందుకు..
- రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై కఠిన చర్యలు
- ప్రజలకు పెరిగిన విశ్వాసం
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి వెల్లడి
- మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ
- 2025 వార్షిక నివేదిక ఆవిష్కరణ




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 26 ప్రభాతవార్త:** ఈ ఏడాదిలో మహబూబ్నగర్ జిల్లా పోలీస్ శాఖ పనితీరు సమర్థవంతంగా ఉందని, నేరాలు తగ్గి రికవరీ రేటు పెరిగిందని మహబూబ్‌గర్‌ఎస్పీ జానకి వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్‌శాఖకు సంబంధించిన 2025 సంవత్సరపు వార్షిక నివేదికను పత్రికా సమావేశం ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖచేపట్టిన శాంతిభద్రతలు, నేర నియంత్రణ, మహిళలు–బాలికల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణలో సాధించిన ముఖ్యమైన విజయాలను వివరించారు. ఈ సంవత్సరం జిల్లా పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా రోజువారీ విధులతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ప్రజలకు నిరంతర సేవలు అందించారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కఠిన భద్రతా చర్యలు చేపట్టి ఎన్నికలను ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా నిర్వహించారు. ఎన్నికల తనిఖీల్లో రూ.11,08,250 నగదు, 1050.23 లీటర్ల మద్యం (విలువ రూ.6,93,858) స్వాధీనం చేసుకోగా, రూ.7,200 విలువగల ఉచితాల పంపిణీ సామగ్రి పట్టుబడింది. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసి, 458 మెమోలు జారీ చేసి, 640 మందిని బైండ్ ఓవర్ చేశారు. 73 నాకాబందీ ఆపరేషన్లతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయి. నేర నియంత్రణలో భాగంగా 2024లో 5937 కేసులు నమోదుకాగా, 2025లో 5,662 కేసులు మాత్రమే నమోదయ్యాయి. దీంతో నేరాల రేటు సుమారు 5శాతం తగ్గింది.ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు 2024లో 9252కాగా,2025లో 11775 దరఖాస్తులను స్వీకరించి తక్షణ చర్యలు తీసుకున్నారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ షీ టీమ్స్, పోలీసు సురక్షా కళాబృందం, భరోసా కేంద్రం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా భద్రత పోలీసు బాధ్యత" అనే నినాదంతో గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, కళాశాలల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. భరోసా కేంద్రంలో 168 కేసులు నమోదు కాగా, 119 కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించగా,ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు 2024లో 235కాగా 2025లో 231అయ్యాయి. ప్రాణాంతకముకాని ప్రమాదాలు 2024లో 255 కాగా 2025లో 286 అయ్యాయి.జాతీయ రహదారుల్లో ప్రమాదాలు 2024లో 425నుంచి 2025లో 475కు పెరిగాయి. ఇతర రహదారుల్లో ప్రమాదాలు 2024లో 140 కాగా 2025లో 155 అయ్యాయి.మొత్తం రోడ్డు –మిగతా4లో..




వార్షిక నివేదికను విడుదల చేస్తున్న ఎస్పీ జానకి, పోలీస్ అధికారులు

## నేడు కొల్లాపూర్‌కు
# కల్వకుంట్ల కవిత రాక!



**కొల్లాపూర్, డిసెంబరు 26, ప్రభాతవార్త :** నేడు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కొల్లాపూర్ నియోజక వర్గంలో పర్యటన చేయనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ సందర్శించి ఉదయం 10:30 గంటలకు పాలమూరు-రంగారెడ్డి (అంజనగిరి) పంప్ హౌస్ పరిశీలన చేయనున్నారు.ఉదయం 11 గంటలకు పెంట్లవెల్లి మండల కేంద్రంలో రుణ మాఫీ కాని మండల భాదిత రైతులతో సమావేశం నిర్వహిస్తారు. ఉదయం 11:30 గంటలకు పెద్ద కొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల ఎరుకల సంఘం సభ్యులతో భేటీ,మధ్యాహ్నం 12 గంటలకు ముదిరాజ్ సంఘం సభ్యులతో సమావేశం,మధ్యాహ్నం 12:30 గంటలకు మామిడి రైతులతో సంభాషణ, రైతులు, వివిధ వర్గాల సమస్యలపై చర్చించనున్న కవిత అనంతరం నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో పర్యటన కొనసాగనుందని సమాచారం.

# 2029లో ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

- రెండోసారి దేవరకద్ర ఎమ్మెల్యేగా ఉంటా
- ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వబోతున్నాం
- సంక్రాంతికి రైతు భరోసా ఇస్తున్నాం
- కౌకుంట్ల మండలంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



ఆత్మీయ సమ్మేళనం లో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, డిసెంబరు 26 ప్రభాతవార్త:** 2029 ఎన్నికల్లో మళ్ళీ సీఎం రేవంత్ రెడ్డి అవుతారని, 2029 దేవరకద్రకు రెండోసారి ఎమ్మెల్యేగా నేనే ఉంటానని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో దేవరకద్ర, కౌకుంట్ల,చిన్నచింతకుంట,మండలాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్‌మెంబర్లతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని, నూతన ప్రజా ప్రతినిధులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి,ఉమ్మడి పాలమూరుజిల్లాలో కొడంగల్ తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సర్పంచ్లను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల ఫలితాలే రాబోయే ఎంపీటీసీ, జడ్పీటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో పునరావృతం అవుతాయి. రాష్ట్రంలో మరోసారి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు నిరంతరం ప్రలకు అందుబాటులో ఉంటూ,కష్టపడి పనిచేసి ప్రజల మన్ననలు పొంది పార్టీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. మూడు విడతలుగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గంలో 134 సీట్ల గాను, కాంగ్రెస్ పార్టీ 93 స్థానాలు అనగా 70 శాతం సీట్లు గెలుచుకున్నారన్నారు. సర్పంచులుగా గెలిచిన వ్యక్తులు మీ ప్రాంతాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు నోట్ చేసుకుని, సమస్యలను పష్కరిద్దాం అన్నారు. గెలిచిన సర్పంచులు అధికారులతో సమన్వయంతో పని చేస్తూ, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులకు ఇచ్చిన మాటమేరకు 500 బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు.అదేవిధంగా సంక్రాంతికి రైతుభరోసా ఇస్తున్నామన్నారు. పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను మంజూరు చేశామన్నారు. ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇల్లు ఇవ్వబోతున్నామన్నారు.పదేళ్ల అధికారంలో ఉన్న బిఆంఎస్ప్రభుత్వం గ్రామాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో 224కోట్ల రుణమాఫీ జరిగింది. 46వేల కుటుంబాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందన్నారు. పాలమూరు ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి అడిగిందే తడవుగా కురుమూర్తి దేవస్థానం వద్ద ఎలివేటెడ్ కారిడార్, దేవరకద్రను మున్సిపాలిటీ గుర్తించడంతో –మిగతా3లో..

# గ్రామ పంచాయతీల్లో ఎగిరిన గులాబి జెండా

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి
- నీళ్లు ఇవ్వడానికి చేతకాక క్రాప్ హాలీడే ఇస్తున్నారు
- రైతులు కష్టపడుతుంటే మంత్రి విహార యాత్ర చేస్తున్నాడు
- పాలమూరు నది జాలాల హక్కుల సాధనకై సమావేశం
- సోలిపూర్, సవాయి గూడెం ఫలితాలపై మీద కోర్టులో కేసులు వేసాం : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి

**వనపర్తి, డిసెంబరు 26 ప్రభాతవార్త:** అధికార పార్టీ అహం, మద్యం, డబ్బుల ముందు పోటిలో నిలబడి గులాబీ జెండా మెడలో వేసుకుని ప్రజా క్షేత్రంలో యుద్ధంచేసి కుంభస్థలం లాంటి పెద్ద గ్రామపంచాయతీల్లో గులాబిజెండా ఎగురవేశారని ఎన్నిఅడ్డంకులు సృటించిన రాష్ట్ర స్థాయిలో చరిత్ర సృష్టిచారు గోపాల్ పేట మండల ప్రజలు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాస గృహం నుండి స్థానిక నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం రాజాపేట గ్రామ శివారులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు అభినందనలు తెలుపుతూ పాలమూరు నది జాలాల హక్కుల సాధనకై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మీద అధికారంలోకి వచ్చిన తరువాత రెండు నెలలోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని లక్షల మంది రైతులు యూరియా కోసం నిలబడ్డారని, ప్రభుత్వ ఉద్యోగుల పదవి విమరణ తరువాత రావాల్సిన డబ్బు లు ఇవ్వలేదని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ లో 60 మంది విద్యార్థులు చనిపోయారు. 700 మంది రైతులు చనిపోయారని ఇవ్వని ప్రభుత్వ వైఫల్యంకు నిదర్శనమన్నారు. నీళ్ల అదించడానికి చేత కాక జూరాల ప్రాజెక్టు నుండి 45 రోజులు వరద నీరు వృధాగా సముద్రంలో కలిసిన తరువాత కేఎల్ఐ మోటార్లు ఆన్ చేసారని వరద నీరు వచ్చిన సమయంలో ఆన్ చేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. జూరాల ప్రాజెక్టుకు పైన గల ప్రభుత్వంతో మాట్లాడి గతంలో నీళ్లు అందించి క్రాప్ హాలీడే అనేది లేకుండా చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం వరద నీరు సముద్రంలోకి వెళ్లిన తరువాత కర్ణాటకతో మాట్లాడ లేక క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు.నీళ్లలేక రైతులు కష్టపడుతుంటే ఇక్కడ ఉన్న జిల్లా మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి సోమశిలలో విహారయాత్ర చేస్తున్నాడని విమర్శించారు.

**గడిచిన రెండేళ్ల లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో తట్టెడు మన్ను తీయలేదు ..**

ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు దిశగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా తమ ప్రభుత్వం లో 90 శాతం పనులు పూర్తి చేసినప్పటికి మిగిలిన పనులను చేయకుండా గడిచిన –మిగతా3లో..

## గిరక బండ్ల పోటీలను ప్రారంభించిన బాసు హనుమంతు నాయుడు

**గద్వాల డిసెంబర్ 26, ప్రభాత వార్త:** గద్వాల నియోజకవర్గం గట్టు మండలం రాయపురం గ్రామంలో గోకరమయ్య ఉరుసు సందర్భంగా ఏర్పాటుచేసిన గిరక బండ్ల పోటీలను బిఆర్ యస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన బాసు హనుమంతు మాట్లాడుతూ మన గ్రామీణ సాంప్రదాయాలను అనుసరిస్తూ ఎద్దుల బండ్ల గిరిక పోటీలను నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ పోటీలను ద్విగ్విజయం చేయాలని, ఎలాంటి ఆటంకాలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రజలందరు గోకర్మయ్య ఉత్సవాల ను సంతోషముగా జరుపుకుని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోవిందమ్మ, తిమ్మప్ప, కర్రెప్ప, నరసింహులు, నూర్ పాషా, బాసు గోపాల్, మద్దిలే టి,రాజు నాయుడు,నల్లారెడ్డి,బాసు బోజ్జయ్య నాయుడు, రాజు,వీరేష్,ఆంజనేయులు,హను మంతు, కృష్ణ,మోహన్,రవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న బాసు హనుమంతు నాయుడు

## పేదలకు అండగా నిలిచేది ఎర్రజెండా మాత్రమే

**ఆత్మకూర్ డిసెంబర్ 26, ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడ పేదలకు అన్యాయం జరిగిన పేదవారి తరఫున పోరాడేది కేవలం ఎర్రజెండా మాత్రమే అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వనపర్తి జిల్లా కమిటీ నాయకులు ప్రసాద్, రాజు తదితరులు అన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలో కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.ఈసందర్భంగా పార్టీనాయకులు ప్రసాద్ ఎర్రజెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదల పొట్ట కొట్టి సంపన్న వర్గాలకు మాత్రమే అండగా నిలవడం కార్మికులు ముక్తకంఠంతో ఖండిస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ అవినీతి జరిగినా మొట్టమొదటిగా కమ్యూనిస్టులు మాత్రమే ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని సామాన్య ప్రజలు గుర్తించి కమ్యూనిస్టు పార్టీలకు అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటయ్య రాజన్న ముసలామని భక్తరాజ్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు

## నట్టల నివారణ కార్యక్రమం విజయవంతం

**ఉప్పునుంతల, డిసెంబరు 26 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పశు సంవర్ధక శాఖ వారి సారథ్యంలో మండల కేంద్రమైన ఉప్పునుంతల పశువు సంవర్ధక శాఖ ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో జీవాలకు అందిస్తున్న నట్టల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. శుక్రవారం మండలంలోని తిరుమలాపూర్, కంసానిపల్లి, కంసానిపల్లి తాండ గ్రామాల్లో సర్పంచులు లలిత, వాల్యా నాయక్, తిరుమల పూర్ ఉప సర్పంచ్ రేణయ్యలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల పశు వైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్,జెవిఓ శ్రీను, ఓస్ హాబీబ్, గోపాల మిత్రులు కొట్టే తిరుపతయ్య, అంజయ్య, శ్రీను తో పాటు ఆయా గ్రామాల జీవాల పెంపకం దారులు పాల్గొన్నారు. శుక్రవారం ఉప్పునుంతల పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 3585 గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్ వివరించారు.



కంసానిపల్లి తండాలో జీవాలకు నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వాల్యా నాయక్

## పేదల పక్షాన పోరాడే పార్టీ ఎర్రజెండా

**అమరచింత డిసెంబర్ 26, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలతో పాటు పేదల పక్షాన పోరాడే పార్టీ ఎర్రజెండా మాత్రమేనని సిపిఐ మాస్ లైన్ నాయకులు కే రాజన్న, ప్రసాద్, అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల సందర్భంగా శుక్రవా రం అమరచింత మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ దగ్గర సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు జండా ఆవి ష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడనప్పుడు ప్రజలు దుర్భర పరిస్థితి ఎదుర్కొన్నారని కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిన తర్వాత కార్మికుల, రైతుల సమస్యలపై ఉద్యమాలు చేసి వారి హక్కులను సాధించామని వారు తె లిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవ లంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధంకావాలని వారు కోరా రు. ఈ కార్యక్రమంలో సిపిఎంఎల్ మాస్ లైన్ నాయకులు మసలమని, కురుమన్న ప్రేమరత్నం వెంకటయ్య రామచందర్ జి బాలస్వామి ఆనందు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ జెండా ఆవిష్కరణ

### రైతులు ఉచిత నట్టలు నివారణ మందులను

## సద్వినియోగం చేసుకోవాలి : డా.స్వరూప రాణి

**వడ్డేపల్లి, డిసెంబరు 26 ప్రభాతవార్త:** మండలం గొర్రెలు, మేకలకు ముందస్తుగా నట్టల నివారణ మందును కాపర్లు తప్పకుండ తాగించాలని మండల పశు వైద్య అధికారి డా. స్వరూపరాణి తెలిపారు. శుక్రవారం పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కొంకల వెంకట్రామా నగర్, జిల్లేడు దిన్నెలో పశు వైద్య సిబ్బంది గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టలు నివారణ మందులు తాగించారు. వెంకట్రామనగర్ సర్పంచ్ వాసుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కుర్వ గొంగల్ల దేవేంద్రలు కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 22 మంది గొర్రెలు పెంపకందారులకు చెందిన గొర్రెలు 3255, మేకలు 460 మొత్తం 3715 జీవాలకు నట్టలు నివారణ మందులు తాగించారు. జీవాలు త్వరగా బాగా బలంగా మారుతాయని తెలిపారు.మాంసం పెరుగుతుందని తెలిపారు. రైతులకు ఆర్థిక లాభం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎల్ఓ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పి.వర ప్రసాద్, ఎల్ఎస్ఏ లైవ్ స్టాక్ అసిస్టెంట్ షైక్ లతీఫ్, ఓఎస్‌లు వెంకటమ్మ, కృష్ణ, రవి పాల్గొన్నారు.



నట్టల నివారణ మందులు వేస్తున్న దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

### అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

**నవాబుపేట, డిసెంబరు 26 ప్రభాతవార్త :** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన జడ్చర్ల మండలం బండమీది పల్లిలో రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం నవాబుపేట మండలం కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన దండుస్వామి (25) ద్విచక్రవాహనంపై జడ్చర్ల నుంచి ఉదండాపూర్ మీదుగా స్వగ్రామం వెళ్తున్నారు. బండమీదిపల్లి దగ్గర గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దండు స్వామి తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొన్న ద్విచక్ర వాహనం బండమీదిపల్లి వాసిదే అని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు సర్పంచ్ బాలయ్య తెలిపారు. అయితే మృతుని కుటుంబ సభ్యులు వాహనాలు ఢీకొన్న స్థలం కంటే దూరంలో మృతుడు పడి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులు జడ్చర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మేస్త్రీ పనిచేసే దండుస్వామికి భార్య ఉన్నారు.



మృతి చెందిన దండుస్వామి

# ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి చిట్టెం రామ్మోహన్ రెడ్డికి లేదు

**అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రభుత్వంపై విమర్శలు**

**అమరచింత మున్సిపాలిటీలో జరిగిన 9 కోట్ల అవినీతిలో నీ వాటా ఎంత**

**చిట్టెం రామ్మోహన్ రెడ్డికి రాజకీయ బిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ**

**డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్

అమరచింత డిసెంబర్ 26, ప్రభాత వార్త: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆగ్రగామిగా అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకనే మక్తల్ మాజీ ఎమ్మెల్యే, చిట్టెం రామ్మోహన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి, మంత్రి వాకిటి శ్రీహరిని విమర్శించే స్థాయి ఆయనకు లేదని డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ కాన్ అన్నారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత టిఆర్ఎస్ పార్టీలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే, చిట్టెం రామ్మోహన్ రెడ్డి 10 ఏండ్లు ఎమ్మెల్యేగా ఉండి ధర్మాపూర్, మస్తీపూర్, నందిమల్ల గ్రామాలకు రోడ్లు మంజూరైన పనులు ఎందుకు చేపట్ట లేదని చిట్టెం రామ్మోహన్ రెడ్డి కాంట్రాక్టర్లకు పర్సంటేజ్లు ఇవ్వాలని వేధింపుల వల్లే రోడ్లు వేయలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు ఏండ్లలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో ఆయా గ్రామాలకు రోడ్లు వేశామని ఆయన తెలిపారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నా తమ్ముళ్ల పర్సంటేజీలు, భూకబ్జాల కు పాల్పడుతున్నారని చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆరోపించడం సరైన పద్ధతి కాదని దమ్ముంటే నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. అమరచింత మున్సిపాలిటీలో టిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన మున్సిపల్ చైర్మన్ తొమ్మిది కోట్ల అవినీతి జరిగిన ఏనాడు పట్టించుకోని చిట్టెం రామ్మోహన్ రెడ్డి 9 కోట్ల అవినీతిలో నీ వాటా ఎంతని ఆయన ప్రశ్నించారు. జూరాల ప్రాజెక్టు నుండి మాజీ మంత్రి నీళ్ల నిరంజన్ రెడ్డి అక్రమంగా నీటిని తరలిస్తుంటే ఏనాడైనా ప్రశ్నించావా అని ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అనేక పార్టీలు మారారని చెప్పేముందు చిట్టెం రామ్మోహన్ రెడ్డి కుటుంబానికి రాజకీయ బిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని లేనిచో మక్తల్ నియోజకవర్గం లో అభివృద్ధిపై చర్చించడానికి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి స్థలం చెబితే చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని ఆయన ఇంటి దగ్గర ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, ఆత్మకూర్ మార్కెట్ డైరెక్టర్లు శ్యాం కుమార్, విష్ణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి తౌఫిక్, రాకేష్ గౌడ్, హరీష్ నాయక్, వీరేష్ గౌడ్, నరేష్ యాదవ్, అషు, బాలరాజు, దేవరాజు, బీసి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలు క్షమించరు

## కాంగ్రెస్ నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ఆత్మకూర్ డిసెంబర్ 26, ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలో అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలు క్షమించబోరని ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తులసి రాజు యాదవ్ తదితరులు తీవ్రస్థాయిలో టీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. శుక్రవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిడి శ్రీహరి అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తుంటే మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాత్రం అభివృద్ధికి సహకరించకుండా అడ్డుకునాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రజలనుచితంగా గమనిస్తున్నారని ఇప్పటికైనా ఆరోపణలు మాని తమ నాయకుడు చేస్తున్న అభివృద్ధి పనులకు సూచనలు సలహాలు ఇవ్వాలని వారు హితవు పలికారు.తమ నాయకుడు వాకిటి శ్రీహరి ఒకే పార్టీ ఒకే జెండా అనే నినాదంతో పని చేస్తున్నారని 2014 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి మక్తల్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే పార్టీకి వెన్నుపోటు పొడిచి టిఆర్ఎస్ పార్టీలో చేరిన ఘనత రామ్మోహన్ రెడ్డికే దక్కుతుందని వాకిటి శ్రీహరి తమ నాయకుడు పార్టీలు మారినట్లుగా మార్ఫింగ్ ఫోటోలతో ప్రచారం చేస్తూ నయవంచనకు పాల్పడుతున్నారని వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. గత పది సంవత్సరాల కాలంలో ఆత్మకూరు అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోయిన విషయాన్ని గుర్తించి డిసెంబర్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా దాదాపు ఆత్మకూరు ఉమ్మడి మండలంలోని 150 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయాన్ని మరిచిపోయారా అంటూ వారు ప్రశ్నించారు. నియోజకవర్గాల పునరుభజనలో భాగంగా పూర్తిగా నష్టపోయిన ఆత్మకూరు పట్టణానికి పూర్వవైభం తీసుకువచ్చేందుకు తమ నాయకుడు రాష్ట్ర మంత్రి వాకిలి శతవిధానాల ప్రయత్నాలు చేస్తుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు మాత్రం కల్లబొల్లి మాటలతో ప్రజలను నయవంచనకు గురి చేస్తూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే అబద్ధాల ప్రచారం చేయడం మానుకొని అభివృద్ధిలో పాల్పంచుకోవాలని లేని పక్షంలో తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ ,ఆత్మకూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, ఆత్మకూర్ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగిలి గంగాధర్ గౌడ్ ,వెంకట నరసింహారావు, అక్షర స్కూల్ దామోదర్ నాగేష్, రఫీక్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన సర్పంచులు, వార్డు మెంబర్లు

**నవాబుపేట, డిసెంబరు 26 ప్రభాతవార్త :** జడ్చర్ల ఎమ్మెల్యే సమక్షంలో ఇద్దరు స్వతంత్ర సర్పంచులు,క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఇద్దరు సర్పంచులు ఒక సర్పంచ్ అభ్యర్థి పలువురు వార్డు సభ్యులు పార్టీలో చేరారు. మండల పరిధిలోని కారూరు గ్రామ స్వతంత్ర సర్పంచ్, టిఆర్ఎస్ పార్టీ ఏడవ వార్డు సభ్యుని తో పాటు 20 మంది టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. హనుమసానిపల్లి స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి రంజిత్ కుమార్, 4వ వార్డు సభ్యులు బి.కృష్ణయ్య, 7వ వార్డు సభ్యులు చంద్ర శేఖర్,8వ వార్డు సభ్యులు నరేష్, కలమ్మలతో పాటు దాదాపు 40 మంది టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బట్టోనిపల్లి తండా స్వతంత్ర సర్పంచ్ విస్లావత్ స్వాతి మూడవ వార్డు సభ్యులు ధర్మానాయక్‌తో పాటు పలువురు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్లకు అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు రామచంద్రయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్, దేపల్లి వెంకటేష్ గౌడ్, వాసు యాదవ్, భూపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఎర్రోళ్ల రమేష్, నర్సింలు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమాత్య అనుచరులకు భారీ షాక్ ఇచ్చిన ప్రజలు

**వీపనగండ్ల డిసెంబర్ 26, ప్రభాతవార్త:** స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికలలో అమాత్య అనుచరులకు ప్రజలు భారీ షాక్ ఇచ్చారు. ప్రధానంగా మండలంలో చక్రం తిప్పే నాయకులు ఒకరు తప్ప అందరూ కూడా తిరస్కరణకు గురి కావడం వల్ల ఒకింతకు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ ఎందుకు ఈ రకంగా జరిగింది అని ప్రజలు కార్యకర్తలు భావిస్తున్నారు. అయితే ప్రజలకు మంత్రి సహకారంతో ఇందిరమ్మ ఇండ్లు పింఛన్లు తదితర సమస్యలను కూడా పరిష్కరించడం జరిగిందికదా అని కార్యకర్తలు అంటున్నారు. వల్లభాపురం పుల్గర్ జర్ల గోపాల్ దీన్నే గోవర్ధనగిరి సంగినేనిపల్లి గ్రామాలలో భారీ ఓట్లతో బిఆర్ఎస్ అభ్యరులు గెలుపొందడం విశేషం అంతేగాక చావు తప్పి కన్ను లొట్ట పోయింది. అన్న చందంగా కొద్దిపాటి ఓట్లతో కల్వరాల్ల గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం విశేషం అని ఆయా గ్రామాల ప్రజలు కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. లేదు అంటే మంత్రి దృష్టి సారించకపోయి ఉండి ఉంటే కార్యకర్తలను నిద్రమత్తు నుండి లేపకపోతే అక్కడ ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన బిఆర్ఎస్ ఖాతాలోకి అది వెళ్ళిపోయేది అని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అంటున్నారు. మండలంలో 14 గ్రామపంచాయతీలకు గాను 5 బిఆర్ఎస్ గెలవగా కాంగ్రెస్ ఆరు సిపిఎం ఒకటి కాంగ్రెస్ రెబల్ ఒకటి గెలవడం జరిగింది. అయితే ఐదు గ్రామపంచాయతీలు ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి అనుచరులే ప్రధానంగా ఓటమికి గురయ్యారు వీరు ప్రజలకు స్థానిక సంస్థల ఎన్నికలలో ఎందుకు దూరమయ్యారు. అనే ప్రశ్న అనేకమందికి ఆలోచన వస్తుంది. అయితే మంత్రి దగ్గర ప్రతి పనులు మా గ్రామానికి కావాలని తీసుకుపోయే వ్యక్తులు ఆయన దగ్గర మరీ కొట్లాడి ప్రజలకు అవసరమయ్యే పనులు కానీయండి సమస్యలు కానీయండి పరిష్కరించుకొని వ్యక్తులు మరి వారికి ఆయా గ్రామాలలో ప్రజలు ఎందుకు తిరస్కరించారు అని నెమరు వేసుకోవాల్సినటువంటి అవసరము మంత్రి కి ఉంది. ఆయా గ్రామాలలో నిలబెట్టిన అభ్యర్థులు సరిగ్గా లేకపోవడం మా లేక వారు ప్రజలకు ప్రజలు అడిగిన సమస్యలు పరిష్కరించకపోవడం ఆ గ్రామాలలో వారి యొక్క పని విధానం సరిగ్గా లేకపోవడం అన్నది. ఇక్కడ ప్రశ్నగా నిలిచిపోతుంది అయితే అందరిలాగానే వీరు కూడా డబ్బులు ఖర్చు పెట్టారు కదా ఖర్చుపెట్టిన ఎందుకు అక్కడ తమ అభ్యర్థులను గెలిపించుకోలేకపోయారు అన్న ప్రశ్న మీ మాంసంగా మారిపోతుంది. కాబట్టి అమాత్య ఒకసారి ఆలకించండి ప్రజలకు ఆ గ్రామాల అభివృద్ధికి తోడ్పడే విధంగా ఆ గ్రామాల మౌళిక వసతులను పరిష్కరించే విధంగా కృషి చేయవలసి నటువంటి అవసరం ఉంది. ఆ కృషి జరగకపోవడం వల్లనే మంత్రిగారి అనుచరులు ఓటమికి గురి అయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మౌళిక వసతులపై మంత్రిగారు దృష్టి సారించాలని ఇండ్లు పింఛన్లు ఇళ్ల స్థలాలు తదితర అంశాలు పక్కన పెడితే గ్రామీణ ప్రాంతంలో అవసరమైనటువంటి పనులపై దృష్టి పెట్టాల్సినటువంటి అవసరం ఉందని ఈ ఎన్నికలలో ప్రధాన అంశాలు అవే ఎజెండాగా మారాయి. ఇప్పటికైనా మంత్రి దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మంత్రి జూపల్లి కృష్ణారావు ( ఫైల్ )

## మంత్రిని కలిసిన వీపనగండ్ల ఉపసర్పంచ్



ఉపసర్పంచ్ ను శాలువాతో సన్మానిస్తున్న మంత్రి జూపల్లి

**వీపనగండ్ల డిసెంబర్ 26, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన ఉప సర్పంచ్ మధుగాని బాల పేరు ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వీపనగండ్ల మండల కేంద్రానికి సంబంధించిన సమస్యలపై ఆయనకు తెలియజేశారు. మండలంలో ఉన్న మోలిక వసతులను మెరుగుపరచడానికి మీ సహకారం కావాలని వారు ఆయనతో అడిగారు. విధులలో ఉన్న అపరిశుభ్రత సంబంధించి కొన్ని డ్రైనేజీలను పూర్తి చేసేటందుకోసం నిధులు కేటాయించాలని వారు ఆయనను కోరారు. అనంతరం ఆయనను మంత్రి జూపల్లి కృష్ణారావు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బసవరాజు గౌడు బాల పిరు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

## బేకరీని ప్రారంభించిన ఎమ్మెల్యే

**భూత్పూర్,డిసెంబర్ 26,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ బైట్స్ ఫుడ్ కోర్టు అండ్ బేకరీని శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెంద్యాల పద్మ,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్‌తో పాటు నాయకులు కెంద్యాల మశ్చేందర్,బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప,కెంద్యాల రాజేష్,మట్టి ఆనంద్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్ మండల సర్పంచుల సంఘం తూమ్ కృష్ణారెడ్డి ఎన్నిక

**మల్దకల్ డిసెంబర్ 26, ప్రభాతవార్త;** గద్వాల పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల. కృష్ణమోహన్ రెడ్డి సహకారం తో మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన నూతన గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి ని మల్దకల్ మండలం సర్పంచుల సంఘం మండల అధ్యక్షునిగా తూమ్ కృష్ణారెడ్డిని ఎన్నుకొని, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు అమరవాయి గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.... ఎమ్మెల్యే ఆశీస్సులతో మల్దకల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సహకారంతోటి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గట్టు మండల మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, కేటీ దొడ్డి మండల మాజీ జడ్పీటీసి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రఘువీర్ యాదవ్‌ను సన్మానించిన బిజెపి నాయకులు



రఘువీర్ యాదవ్‌ను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**నారాయణ పేట, డిసెంబరు 26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోఇటీవల పదోన్నతి పొంది కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన రఘువీర్ యాదవ్‌ని అఖిలభారత యాదవ అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య వారి స్వగృహంలో శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆశీర్వాదాలతో వారు మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణానికి చెందిన బీజేవైఎం నాయకులు పల్ల రఘు, 9వ వార్డు మాజీ కౌన్సిలర్ మహేష్ కుమార్, సిద్ధు శ్రవణ్ కుమార్ తదితర మిత్రబృందంతో కలిసి రఘువీర్ యాదవ్‌ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రఘువీర్ యాదవ్ తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి ద్వారా పార్టీకి మరింత సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు.

## పాతపల్లిలో ఎర్రజెండా పార్టీ శతాబ్ది వేడుకలు

**ధన్వాడ, డిసెంబరు 26 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం పాతపల్లి గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఎర్రజెండా పార్టీ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భగత్‌సింగ్ చౌరస్తా వద్ద శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, పీడీఎఫ్, పీవైఎల్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక కూలి సంఘం, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు



ఎర్రజెండా శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు జి. కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ పేదల పక్షాన నిరంతరం పోరాడే పార్టీ ఎర్రజెండా ఒక్కటేనని పేర్కొన్నారు. ప్రపంచంలో కార్మికులు ఎక్కడ ఉన్నా అక్కడ ఎర్రజెండా ఎగురుతుందని శతాబ్ది పూర్తి చేసుకున్న ఈ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు వై.రాజు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కుల కోసం ఎర్రజెండా పార్టీ అచంచలంగా నిలబడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.టీరప్పతో పాటు ఈ. గోవర్ధన్, జి. శీను, వై.నర్సింహులు, అంజి, పీకే రాములు, కథలప్ప, వార్డు మెంబర్లు రామాంజనేయులు, బండ శ్రీను తదితరులు పాల్గొన్నారు. శతాబ్ది వేడుకలను పాతపల్లి గ్రామంలో విజయవంతంగా నిర్వహించడంతో పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు.

## సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శికి ఘన సన్మానం



సర్పంచ్ హుస్సేన్‌ను, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహమ్మద్ సిరాజ్‌ను సన్మానించిన ముస్లిం సోదరులు

**ఇటిక్యాల డిసెంబర్ 26, ప్రభాతవార్త;** అల్లంపూర్ నియోజకవర్గం మానవపాడు మండల పరిధిలోని అమరవాయి గ్రామంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఆర్ఎంపి వైద్యుడు గ్రామ సర్పంచ్‌గా హుస్సేన్ ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అమరవాయి సర్పంచ్ హుస్సేన్, మానవపాడు గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహమ్మద్ సిరాజ్ ను ముస్లిం సోదరులు ఘనంగా వారిని శాలువా పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా ఐజ మండలం బైనంపల్లి గ్రామస్తులు, మానవపాడు మాజీ ఉపసర్పంచ్ పైల్వాన్ చాంద్ బాషా, మొల్ల కలీం, మెకానిక్ మహబూబ్ షేక్షావలి, బైనంపల్లి నూర్ అహ్మద్, ఐజ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షాలుమియా, ఆర్.ఎం.పి గూడుమియా, మొల్ల బందే నవాబ్ తదితర ముస్లిం మైనార్టీ సోదరులు ఘనంగా అమరవాయి గ్రామ నూతన సర్పంచ్ హుస్సేన్ ను. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహమ్మద్ సిరాజును ముస్లిం సోదరులు ఘనంగా వారిని సన్మానించారు.

## పోచమ్మ తల్లి బొడ్రాయి రెండవ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే





బొడ్రాయి రెండవ వార్షికోత్సవంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర,డిసెంబర్ 26 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి బొడ్రాయి రెండవ వార్షికోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిపాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా పుట్టపల్లి గ్రామ సర్పంచ్ చెన్నకేశవులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పోచమ్మ తల్లి ఆశీస్సులతో పుట్టపల్లి గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కిషన్ రావు, ముచ్చింతల గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పుట్టపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్సులో ప్రసవం.. తల్లిబిడ్డ క్షేమం



అంబులెన్సులో సాధారణ కాన్పు చేసిన 108 సిబ్బంది

**లింగాల, డిసెంబరు 26 ప్రభాతవార్త:** అంబులెన్సులోనే ప్రసవం జరిగి పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శుక్రవారం లింగాల మండలంలోని ఎర్రపెంట గ్రామానికి చెందిన బల్మూరి విజయ (26) పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్సుకు సమాచారం అందించారు. లింగాల అంబులెన్సు సిబ్బంది పురిటినొప్పులు వస్తున్న మహిళాను తీసుకువస్తున్న మార్గమధ్యం లో గర్భిణీకి పురిటినొప్పులు అధికంగా రావడంతో డా. కాశి రెడ్డి సూచన మేరకు చెన్నంపల్లి మార్గమధ్యంలో సాధారణ కాన్పు చేశారు. పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. తల్లి బిడ్డను లింగాల సిహెచ్‌సి ఆసుపత్రిలో చేర్పించారు. అంబులెన్సులోనే సాధారణ కాన్పు చేయడంతో 108 అంబులెన్సు సిబ్బందిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అంబులెన్సు సిబ్బంది పైలట్ ఖాజా, టెక్నీషియన్ టి.లక్ష్మన్ కి పిఎం జాన్ సాయద్, ఈఎంఈ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

## ఇంటి నిర్మాణానికి అర్థిక సహకారం

**కొల్లాపూర్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గం లోనీ పెంట్లవెల్లి మండలం లోని కొండూరు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న కటిక కేశవులు నివాస గృహం పునర్నిరాణానికి ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన కేతూరి ధర్మతేజ పిలుపుతో అతని స్నేహితులు స్పందించి ఆర్థిక సహాయం చేసి దాతృత్వాన్ని చాటారు. గ్రామానికి చెందిన కటిక కేశవులు కుటుంబం గత కొన్ని ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న నివాస గృహంలో ఉంటూ కూలడానికి సిద్ధంగా ఉండి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో వారి నివాస గృహానికి రూ.70 వేలతో మరమ్మత్తులు చేయడానికి ముందుకు వచ్చారు. గ్రామ మాజీ సర్పంచ్ మండల సీనియర్ నాయకులు నల్లబోతుల గోపాల్ సమక్షంలో సర్పంచ్ కేతూరి ధర్మతేజ, గ్రామ ముఖ్య నాయకులతో కలిసి వారి స్నేహితులు సాక్షి టీవీ రిపోర్టర్ టియుడబ్ల్యుజె (ఐజెయు) నియోజకవర్గ అధ్యక్షులు మాలే రాజేందర్ గౌడ్,టిఎస్ సిపిఎస్ ఇయు రాష్ట్ర సహా అధ్యక్షులు ఉపాధ్యాయులు బృంగి కృష్ణ ప్రసాద్,220 కెవి ఎస్ఎస్ మిషన్ భగీరథ ఎల్లూరు ఇంచార్జ్ పెబ్బేటి గిరి బాబు,టాస్క్ ట్రైనర్ తోషకాని వెంకటేష్, ఉపాధ్యాయులు క్రాంతి కుమార్ లు వారి నివాసానికి వెళ్లి కుటుంబ యజమానితో వారి ఆర్థిక స్థితి గతులు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత మేరకు వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాముడు,వార్డుమెంబర్ విజావతి గౌడ్,గ్రామ పెద్దలు పెద్దకృష్ణా రావు,నాయకులు విజయ్ గౌడ్,పలుస రవి గౌడ్, సంఘనమోని రాము,ఎల్లగౌడ్,రామ్మూర్తి, శ్రీకాంత్,మధు,రెడ్డి రాఘవేంద్ర,సాయిచరణ్,ధర్మ, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి అర్థిక సహకారం అందిస్తున్న సర్పంచ్ స్నేహితులు

## ఆసక్తి కలవారు పదవులకు దరఖాస్తు చేసుకోండి

**పార్టీని మరింత బలోపేతం చేయాలి**

**డీసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్**

**పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు**

**తుది నిర్ణయం జిల్లా అధ్యక్షుడిదే**

**జిల్లా పరిశీలకులు గంజి భాస్కర్**



మాట్లాడుతున్న సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 26 ప్రభాతవార్త:** జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పదవుల్లో అవకాశం లభిస్తుందన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా కార్పొరేటర్ గా నిలబడాలనుకునేవారు జిల్లా పదవులకు దరఖాస్తు చేసుకోవద్దని నా అభిప్రాయం అని అన్నారు. ఒకవేళ భవిష్యత్తులో కార్పొరేటర్ గా, పదవిపరంగా కూడా పని చేస్తామనుకంటే దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. జిల్లా పరిశీలకులు గంజి భాస్కర్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి పదవులు లభిస్తాయని అన్నారు. పార్టీ పరంగా జిల్లాలో డిసిసి అధ్యక్షుడిదే తుది నిర్ణయమని అన్నారు. పార్టీ లైన్ దాటి, క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడితే ఎవరైనా సరే వేటు తప్పదని అన్నారు. జిల్లాలోని ప్రతి బ్లాక్ కు ఒక జిల్లా ఉపాధ్యక్ష పదవి, బ్లాక్ కు రెండు జిల్లా ప్రధాన కార్యదర్శిలు, ప్రతి మండలానికి ఒక కార్యదర్శి పదవి, జిల్లా కోశాధికారి, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక అధికార ప్రతినిధి, అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్ లో జనాభా ఆధారంగా ప్రతి 10 డివిజన్‌లకు ఒక ప్రధాన కార్యదర్శి, ఐదు డివిజన్లకు ఒక కార్యదర్శి పదవులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు. ఈనెల 31 లేదా వచ్చేనెల మొదటి వారంలో జిల్లా పార్టీ కార్యవర్గాన్ని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పర్సన్ బెక్కరి అనిత, టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, నాయకులు చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రీ, అమరేందర్ రాజు, వసంత, రాఘవేందర్ రాజు, బెక్కరి మధుసూదన్ రెడ్డి, అజ్మత్ అలీ, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతకుమార్**

**వనపర్తి, డిసెంబరు 26 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల లో భాగంగా ఎస్ఐఆర్ (ఓటర్ జాబితా సవరణ) వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకి ముఖ్య అతిథిలుగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంత కుమార్, కార్యదర్శి పోతుగంటి భరత్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు డి.నారాయణతో పాటు పట్టణ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన, పోటీ చేసి ఓడిపోయిన, సర్పంచ్ అభ్యర్థులను, వార్డు సభ్యులను వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంత కుమార్ మాట్లాడుతూ వాజ్‌పేయి చాలా నిరాడంబరమైన వ్యక్తి, గొప్ప నాయకుడు, కవి, ఒక ఆదర్శవంతమైన పురుషుడని చెప్పవచ్చు అని కొనియాడారు. జన సంఘం కాలం నుండి భారతీయ జనతా పార్టీని స్థాపించి, భారత దేశంలోనే సనాతన ధర్మానికి, హిందుత్వానికి పునాదులు వేసినటువంటి వ్యక్తి అని గుర్తు చేశారు. ప్రతి బిజెపి పార్టీ కార్యకర్త వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలని, వారి స్వభావాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంత కుమార్

నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సుబ్బిరెడ్డి వెంకట్రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, స్థానిక సంస్థల జిల్లా కన్వీనర్ మెంటం పల్లి పురుషోత్తం, ఓబిసి మోర్చా రాష్ట్రా అధికార ప్రతినిధి శ్రీశైలం, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, కల్పన మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, సంస్థాగత కార్యదర్శి కేతూరి బుడ్డన్న, బిజెపి జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, జిల్లా సెక్రెటరీ ఆగపోకు కుమార్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## 2029లో ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

పాటు నియోజకవర్గానికి డిగ్రీ కాలేజ్, జూనియర్ కాలేజ్, కోర్టు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏటీసీ మంజూరు చేశారు. దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించామన్నారు. కౌకుంట్ల మండలంలో జూనియర్ కాలేజ్ మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. గెలిచిన సర్పంచ్లు గ్రామంలో మౌలిక సదుపాయాలు, సిసి రోడ్లు, డ్రైనేజీ ,మంచినీటి సదుపాయాలు గ్రామానికి కావాల్సిన వాటిపై దృష్టి సాధించి, గ్రామస్తులకు అందుబాటులో ఉండి, ప్రజాసేవ చేస్తే మరోసారి ప్రజలే పట్టం కడతారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, ఆర్గనైజేషన్



కౌకుంట్ల సర్పంచ్, వార్డ్ మెంబర్లకు శుభాకాంక్షలు తెలియజేసి మెమోరాండం అందజేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డికి మెమెంటో అందజేస్తున్న దృశ్యం

సెక్రెటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు,మార్కెట్ కమిటీచైర్మన్ కథలప్ప,కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర పట్టణ అధ్యక్షుడు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, ఉమ్మిగారి వెంకటేష్, గోపన్ పల్లి శ్రీకాంత్ రెడ్డి, రాంబాబు, గుడబండ అమరేశ్వర్ రెడ్డి, ముచ్చింతల తిరుపతిరెడ్డి, కౌకుంట్ల ఆంజనేయులు, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎండి నజీర్, బేరీ నాగన్న,వడ్లసూరి, మన్నెపురెడ్డి, తుమ్మల నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులుసర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల్లో ఎగిరిన గులాబి జెండా

(మొదటి పేజీ తరువాయి)

రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మన్ను కూడా తీయ లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 35 లక్షల ఎకరాలు ఉండగా అందు లో కేవలం 10లక్షల ఎకరాల్లో సాగుఅవుతుందని అందులో9 లక్షల ఎకరాలకు కేసిఆర్ ప్రభుత్వంలో సాగునీరును అందించడం జరిగిం దని మిగిలిన ఎకరాలకు నీళ్లు అందించడానికి పాలమూరు రంగా రెడ్డి ప్రాజెక్టుకు రూపకల్పన చేసి రిజర్వాయర్లు, పంపింగ్ స్టేషన్లు పనులు చేయడం జరిగిందని మిగిలి పోయిన పనులను పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, హాజరైన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

**సోలిపూర్, సవాయి గూడెం ఎన్నికల ఫలితాలపై కోర్టుకు వెళ్లాం...**

ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సోలిపూర్, సవాయి గూడెంలో ముందుగా మనవాళ్ళు గెలిచారని అధికారులు చెప్పారు. కానీ తరువాత కాంగ్రెస్ వాళ్లు గెలిచారని చెప్పారని దాని మీద కోర్టులో కేసులు వేయడం జరిగిందన్నారు. త్వరలోనే తీర్పు వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నాగం తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్, మాజీ ఎంపిపి కృష్ణ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షులు మాణిక్యం, నాయకులు విజయ్, కురుమూర్తి యాదవ్, చిట్యాల.రాము తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల కాంగ్రెస్‌కు షాక్

**బీఆర్ఎస్‌లో చేరిన 150 మంది నాయకులు**

**కండువా కప్పి ఆహ్వానించిన**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**





కెటిఆర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

**జడ్చర్ల, డిసెంబరు 26 ప్రభాతవార్త:** జడ్చర్లలో కాంగ్రెస్ పార్టీకి షాక్ మీదషాక్ తగులుతుంది.ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో ఎమ్మెల్యే సొంత గ్రామంతో పాటు చాలా మండలాల్లో బిఆర్ఎస్ తన ఆధిక్యతను చాటి సత్తా చాటిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మరోసారి జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. నవాబుపేట మండలం వెంకటేశ్వర తండాకు చెందిన సుమారు 150 మంది కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సిద్ధిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు గ్రామస్తులందరూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యంగా గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన బాబు నాయక్, ప్రస్తుత కాంగ్రెస్ ఉపసర్పంచ్ తావూరియా, ఆరుగురు వార్డు సభ్యులు పార్టీ మారారు. వెంకటేశ్వర తండా సర్పంచ్ సేవ్యా నాయక్, కొల్లూరు మాజీ సర్పంచ్ రాజు, నాయకులు చందర్ నాయక్ నేతృత్వంలో రెండు బస్సుల్లో గ్రామస్తులు ఎర్రవల్లి నివాసానికి తరలివెళ్లారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై, పార్టీ నాయకత్వంపై నమ్మకంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు చేరిన నాయకులు తెలిపారు. స్థానిక నాయకత్వం, కేసీఆర్ విజన్ పట్ల గౌరవంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ భారీ చేరికతో జడ్చర్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ



మాట్లాడుతున్న బోయ నరేష్

**ధన్వాడ, డిసెంబరు 26 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం యంనోనిపల్లి గ్రామంలో గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యంనోనీపల్లి సర్పంచ్ బోయ నరేష్ మాట్లాడుతూ నట్టల నివారణ మందు పంపిణీతో గొర్రెల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు పశుపోషకులపై పడే ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పశుసంరక్షణ కార్యక్రమాలను పూర్తిగా వినియోగించుకుని పశుపోషకులు తమ జీవనోపాధిని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్దప్ప, బోయ పెద్ద నరసింహులు, కురువ యాదప్ప, గొర్రెల పెంపకదారులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి అందించిన సర్పంచ్



సీఎం సహాయనిధి అందజేస్తున్న సర్పంచ్

**వెల్దండ,డిసెంబరు 26 ప్రభాతవార్త :**పేద ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం లబ్ధిదారులైన సాయికిరణ్,మంజుల, మహబూబా బేగం, వంశీకృష్ణ, పద్మలకు సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్రసైన్యం మధురాజు, వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, బుద్ధతి ఇష్టాలు శీను, నాయకులు క్యాసారపు వెంకటయ్య, యాదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి


- పాత ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



పాత ఉపాధి హామీ చట్టాని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్న దృశ్యం

**చిన్నంబావి, డిసెంబరు 26 ప్రభాతవార్త:** చిన్నంబావి మండల కేంద్రము రత్నగిరి కాలనీలో శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో విబిజి రాంజీ చట్టం రద్దు చేయాలని, వీటి ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు మాట్లాడుతూ నాడు వామపక్ష పార్టీలు సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నేడు కేంద్రంలో పరిపాలన ఉన్న బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందని, భారత స్వతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించిన మహాత్మా గాంధీ పేరు తొలగించి విబిజి రామ్ పేరు పెట్టి చట్టానికి భద్రత లేకుండా సంవత్సరంలో రెండు నెలల పాటు ఉపాధి పనిని బంద్ చేయించడం, పని చేసుకునే కూలీలకు హక్కు లేకుండా, పాలకుల దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడే విధంగా 2025/197నూతన చట్టాన్ని తీసుకొచ్చి పేద ప్రజల కడుపు కొట్టే విధంగా,కాంట్రాక్టర్లకు జేబులు నింపే విధంగాచట్ట రూప కల్పన చేసిందని దీన్ని మానుకోవాలని, అంతేకాకుండా ఈచట్టం ప్రకారంగా కేంద్రం 60శాతం, రాష్ట్రాలకు 40శాతం వాటా ప్రకారంగా నిధులను విభజించిందనీ ఇది రాష్ట్రాలకు భారం మోపడంతోపాటుఉపాధి పనినిఎత్తివేసే కుట్రచేస్తుందనీ ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన చట్టాన్ని రద్దుచేసి యధావిధిగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారుతెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎం.వెంకటస్వామి,కూలీలు రాముడు, జ్యోతి, దేవమ్మ, కాశమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ గీతారాణికి సన్మానం



సర్పంచ్ గీతారాణిని సన్మానించిన విశ్వకర్మ సంఘం నాయకులు

**నవాబుపేట, డిసెంబరు 26 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభ వేదికపై నవాబ్‌పేట్ సర్పంచ్ గీత రాణిని నవాబ్‌పేట్ వ్యాపార సంఘం అధ్యక్షులు వి. సుధాకర్ చారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుత విజయం సాధించినందుకు గాను గీత రాణిని, అలాగే వ్యాపార రంగంలో జేకే ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలతో నవాబుపేట మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రతివారం అన్నదానం పండగల సమయంలో జెకె ట్రస్టు ద్వారా నవాబుపేట గ్రామ ప్రజలకు పండగ సరుకులను అందిస్తూ శుభ, అశుభ కార్యక్రమాలకు తన వంతు సహాయం చేస్తూ యువకులకు క్రీడా స్ఫూర్తితో వారికి కావలసిన సేవలు సహాయ సహకారాలు అందిస్తూ వృద్ధులకు పెద్ద కొడుకులా సహాయ సహకారాలు అందిస్తూ సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటున్నందుకు గాను వి.సుధాకర్‌చారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వకర్మ సంఘ నాయకులు జెకె ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## త్రిపుర గవర్నర్‌ను కలిసిన బీజేపీ రాష్ట్ర నాయకులు

**గద్వాల, డిసెంబర్26, ప్రభాతవార్త:** హైదరాబాద్ భాగ్య నగరంలోని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కార్యాలయం రాజ్ భవన్‌లో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డినీ గద్వాల బీజేపీ రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల బోకెన్, శాల్వ కప్పి సన్మానించారు.త్రిపుర గవర్నర్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు గద్వాల వెంకటాద్రి రెడ్డి,సంగాల అయ్యప్ప రెడ్డి, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు అప్సర్‌పాషా, శ్రీకాంత్ జీ పాల్గొన్నారు.



## నడిగడ్డకు మంచి రోజులు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**
ప్రస్తావించారు. మహబూబ్‌నగర్ పార్ల మెంట్‌లోని మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల తోపాటు జోగులాంబ గద్వాలపట్టణ కేంద్రంలో కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసారు. గద్వాల ప్రాంతం అక్షరాస్యతలో వెనుకబాటు తనానికి సంబంధించి కండ్లకు కట్టినట్లు లెక్కలతో సహా పార్లమెంట్ సాక్షిగా అరుణమ్మ వివరించారు. ఈ మేరకు కేంద్ర విశ్వవిద్యాలయ అధికార బృందం గద్వాల జిల్లాకు కేంద్రీయ విశ్వ విద్యా లయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో నడిగడ్డ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గద్వాల జేజమ్మగా పేరుపొంది జాతీయ స్థాయి రాజకీయాల్లో తనదైనముద్ర వేసుకున్న ఎంపీ అరుణమ్మ కు ఈ సందర్భంగా నరిగడ్డ ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు.

**కేంద్రం బృందం పర్యటన:** జోగులాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్ మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేంద్ర ప్రతినిధుల బృందం,రాష్ట్ర ఉన్నతాధికారులుపరిశీలించి,ఎంపిక ఖరారుచేశారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన సమయంలో అనువైన ప్రదేశం, మౌలిక సదుపాయాలు, పర్యావరణ అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారని అన్నారు.జిల్లా అధికారులు, కేంద్ర ప్రతినిధులు కలిసి జోగులాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్‌లో పర్యటించి విద్యార్థుల సౌకర్యార్థం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అనువైన స్థలాన్ని పరిశీలించి, ఎంపిక చేశారు.కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు స్థల ఎంపిక గొప్ప ముందు అడుగు అని ఎంపీ డీకే అరుణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర విద్యాశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి జిల్లాలో కేంద్రీయ విద్యాలయల ఏర్పాట్లు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

## తగ్గిన నేరాలు.. ప్రమాదాలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**
ప్రమాద కేసులు 2024లో 1055 కాగా, 2025లో 1103 నమోదయ్యాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుని 2025లో 3245 కేసులు, 2024లో 2578 కేసులు నమోదు చేశారు. 2025లో రూ.32,59,386 జరిమానా, 2024లో రూ.28,94,085 జరిమానా విధించగా, 2025లో 21 మందికి, 2024లో 5 మందికి జైలు శిక్షలు విధించబడ్డాయి.సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా 2025లో 1475 దరఖాస్తులు స్వీకరించి 220కేసులు నమోదు చేశారు. మొత్తం రూ.2,18,17,758 నష్టం జరగగా, అందులో రూ.1,98,79,364 విలువైన మొత్తాన్ని బాధితులకు తిరిగి అందించారు. గత సంవత్సరం కంటే 125 కేసుల్లో ఎక్కువగా రికవరీ చేయడం విశేషం. సిఇఆర్ పోర్టల్ ద్వారా 1173 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగించారు.ఆస్తి నేరాల రికవరీ 29.85 నుంచి 46.89 కు పెరిగింది. 2025లో 327 ఆస్తి నేర కేసులు నమోదు కాగా, 215 మందిని అరెస్టు చేసి రూ.99,83,318 విలువైన ఆస్తిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై 32 మందిని అరెస్టు చేసి 11.850కిలోల గంజాయి,22 కిలోల ఆల్ప్రాజోలం (విలువ రూ.15,23,125) స్వాధీనం చేసుకున్నారు.ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా ఈ సంవత్సరం 1059 మంది బాలురు, 17 మంది బాలికలను బాల కార్మికులుగా ఉన్న స్థితి నుంచి విముక్తి చేసి కుటుంబాలకు అప్పగించారు.జాతీయ లోక్‌అదాలత్ ద్వారాఈ సంవత్సరం1608 ఎఫ్ఐఆర్ కేసులు2739 డిడి మోటారు వాహన చట్టం కేసులుసహా మొత్తం 10,431 కేసులు పరిష్కరించబడ్డాయి.జిల్లాలో ప్రతిరోజూ విధులతో పాటు ఇతర రంగాల్లోనూ జిల్లా పోలీస్ శాఖ ప్రతిభను చాటుకుంది. 2025 మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా ఆసియా ఖండానికి చెందిన 22 మంది సుందరీమణుల పిల్లలమర్రి సందర్శనను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించారు. అలాగే జిల్లా మహిళా ఏఎస్ఐ వనజా రెడ్డి జాతీయ స్థాయి యోగా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించగా, మహిళా కానిస్టేబుల్ రాధిక 74వ ఆల్ ఇండియా పోలీస్ క్లస్టర్ గేమ్స్‌లో ఆర్మ్ రెజ్లింగ్‌లో పథకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.ఇకపై కూడా ప్రజల భద్రత, మహిళల రక్షణ, బాలల సంక్షేమం, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు ప్రజలకు అండగా నిలుస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు.

## గద్వాల జిల్లాల్లో 11శాతం తగ్గిన క్రైమ్ రేట్

**మొదటి పేజీ తరువాయి భాగం..**
చేశారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. 2024 సంవత్సరంతో పోలిస్తే 2025లో (నవంబర్ వరకు) జిల్లాలో నేరాలు 11 శాతం తగ్గాయని వెల్లడించారు. 2024లో ఇదే కాలానికి మొత్తం 2703 కేసులు నమోదు కాగా, 2025లో ఇప్పటివరకు 2410 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ విధంగా మొత్తం11శాతం కేసులు తగ్గాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ వై.మొగలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీధిలైట్లు ప్రారంభం



బటర్ ఫ్లై లైట్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత

**జడ్చర్ల, డిసెంబరు 26 ప్రభాతవార్త:** శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం జడ్చర్ల మున్సిపాలిటీలోని 3వ వార్డులో కల్వకుర్తి రోడ్ లో బట్టర్ ఫ్లై లైట్స్ ప్రారంభించారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత లైట్స్ స్విచ్చాన్‌చేసారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కుమ్మరి రాజు, చైతన్య చౌహాన్,సతీష్ ,మాజీ వార్డ్ మెంబర్ భాస్కర్ రెడ్డి, కోడగల్ సర్పంచ్ సాయిరెడ్డి, 3వ వార్డ్ కాంగ్రెస్ నాయకులు అనంతకిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ ఎలక్ట్రీషియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధితోనే గ్రామ రాజ్యం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన రెడ్డి



సమావేశానికి హాజరైన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు

**మొదటి పేజీ తరువాయి భాగం..**
కార్యక్రమానికి ముందు ఇటీవల అకాల మరణం చెందిన కీర్తి శేషులు మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతాప్ గౌడ్ సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. అనంతరం సన్మాన కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.సర్పంచులు గ్రామ నిధుల పట్ల, విధులు పట్ల అవగాహన కలిగి వుండాలనీ సూచించారు. గద్వాల నియోజకవర్గంలో ప్రతి గ్రామ పంచాయతీల అభివృద్ధి కొరకు ఎస్ డి ఎఫ్ నిధుల ద్వారా 2 కోట్లు 51 లక్షలు రూపాయలు కేటాయించడం జరిగినదన్నారు.ధరూర్ మండలం పరిధిలోని ఎస్ డి ఎఫ్ ద్వారా గ్రామ పంచాయతీలకు 71 లక్షలు రూపాయలు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ పంచాయతీలు అభివృద్ధి కొరకు సీఎం ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందనీ, గ్రామాభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రతి ఒక్కరు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలు మీపై నమ్మకం ఉంచి మిమ్మల్ని గ్రామ సర్పంచిగా ఎన్నుకోవడం జరిగిందనీ, ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి వైపుగా అడుగులు వేయాలి అని సూచించారు. సర్పంచి పదవి ఐదేళ్ల కాలంలో ప్రతి ఒక్క గ్రామం ప్రగతిబాటలో వైపుగా అడుగులు వెయ్యాలనీ, గ్రామాలలో సర్పంచ్ ఉన్నప్పుడు ఫలానా సర్పంచ్ పరిపాలనలో గ్రామంలో అభివృద్ధి చెందినదిని ప్రజలలో చిరస్థాయిగా నిలిచేల పని చేయాలన్నారు. అవకాశం ఉంటుంది. త్వరలోనే గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలీ , సర్పంచుల విధివిధానాల పైన సర్పంచులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి స్పెషల్ డెవలప్మెంట్ ద్వారా ప్రత్యేక నిధుల ద్వారా రైతులు పొలాలకు వెళ్లి మట్టి రోడ్లను కేటాయించడం జరిగింది. ప్రతి గ్రామ పంచాయతీకి మూడు లక్షలు నుంచి 5లక్షల చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు .భవిష్యత్తులో గ్రామాలు అభివృద్ధి చెందడానికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లపుడూ ఉంటాయని అన్నారు.అనంతరం డిసిసి జిల్లా చైర్మెన్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ...గ్రామ సర్పంచులు గ్రామా అభివృద్ధి కి పట్టుబడాలనీ, గద్వాల నియోజక వర్గంలో గ్రామల అభివృద్ధి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండాలని కోరారు. గద్వాల నియోజక వర్గంలో 131గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 108 మంది సర్పంచులు గెలవడం గొప్ప విజయం అన్నారు.ఈకార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మెన్ హనుమంతు, మాజీ ప్రజా ప్రతినిధులు గడ్డం కృష్ణారెడ్డి, శ్రీధర్ గౌడ్, పటేల్ ప్రభాకర్ రెడ్డి, చైర్మెన్ బండారి భాస్కర్, గట్టు తిమ్మప్ప, గట్టు విజయ్, రమేష్ నాయుడు, బిజ్వారం సత్యారెడ్డి, కొత్తపల్లి మహేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జమ్ములమ్మ ఆలయ చైర్మెన్ వెంకట్రాములు, సీడ్ ఆర్గనైజర్ తిమ్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, పలు గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సవరణ చట్టాలను తక్షణమే ఉపసంహరించాలి

### ప్రజాసంఘాల డిమాండ్



మాట్లాడుతున్న సిఐటియు సీనియర్ నాయకులు కిల్లె గోపాల్

**మహబూబ్‌నగర్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. శుక్రవారం సిఐటియు, వ్యవసాయ కార్మికసంఘం, రైతు సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో నల్లజెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ కేంద్ర మోడీ గవర్నమెంట్ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో అ ప్రజాస్వామికమైన ఐదు చట్టాలను చేసి దేశంలో రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు ప్రజలకు నష్టం కలిగించే విధానాలు తెచ్చారని, ప్రధానంగా లేబర్ కోడ్ల కార్మికులహక్కులను సమ్మెనుఉద్యోగ భద్రతను పోరాడే హక్కును నిర్వీర్యం చేసిందని, తక్షణమే ఈ చట్టాన్ని, విద్యుత్ సవరణ చట్టాన్ని శాంతి బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరగబోతుందని హెచ్చరించారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్ మాట్లాడుతూ 2005లో యూపీఏ వన్ గవర్నమెంట్‌లో 64 మంది వామపక్ష ఎంపీల పోరాటం ఫలితంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం వచ్చిందని ,ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం విబిరామ్ జి నూతన చట్టం తెచ్చి వ్యవసాయ కార్మికులకు పనులు లేకుండా, వలసలు వెళ్లే విధంగా చట్టం రూపొందించార ని, చట్టంలో 60 శాతం కేంద్రం నిధులు 40శాతం రాష్ట్రాల నిధులు ఖర్చు పెట్టాలని, 40 శాతం నిధులు ఖర్చు చేయకపోతే 60 శాతం కేంద్రం ఇవ్వదని ,60 రోజులు వ్యవసాయ సీజన్ లో పనులు బందు పెట్టాలని రూపొందించార ని దీనివల్ల వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తక్షణమేఎంఎన్ఆర్జిఎస్ 2005 చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు చేపట్టి కార్పొరేట్ వ్యవసాయానికి అనుగుణంగా చట్టాల రూపొందించిందని గతంలో రద్దు చేసిన మూడు నల్ల చట్టాలను తిరిగి తీసుకొస్తుందని రైతులకు కనీస పంటలకు మద్దతుధర కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని యూరియా కోసం యాప్‌లో అప్లైచేసుకోవాలని విధానాన్ని ఉపసంహరించాలని పాత పద్ధతిలోనే రైతులకు సబ్సిడీలు, సబ్సిడీ లోన్లు కనీసం మద్దతు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఇందులో సిఐటియు సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, రైతు సంఘం సీనియర్ నాయకులు ఏ.రాములు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఐదు అ ప్రజాస్వామిక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిచో ప్రజాసంఘాలను కలిసి వచ్చే అభ్యుదయ పార్టీలను కలుపుకొని పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో సిఐటియు నాయకులు బి.చంద్రకాంత్ ,రాజ్ కుమార్ ,వర్ధగాలన్న, తిరుమలయ్య ,వి. కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జగన్,వి.హనుమంతు, ఖాదరయ్య ,శివలీల, రాములు ,సాయిలు,బుద్దిస్ట్ సొసైటీ జిల్లా నాయకులు బాలకృష్ణయ్య ,వరద లక్ష్మయ్య , పడాల వెంకటయ్య, బాలరాజు కందుర్ రాములు తదితరులు మాట్లాడారు. ప్రధానంగా నల్ల చట్టాలను రద్దు చేయాలని ,విద్యుత్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని ,లేబర్ కోడ్లను రద్దు చేయాలని ,కేంద్ర బిజెపి ప్రభుత్వ అప్రజాస్వామిక చట్టాలనుఉపసంహరించాలని, శాంతి బిల్లును ఉపసంహరించాలని, సహజ వనరుల ప్రైవేటుకరణ ఆపాలని,కార్మికుల కనీస వేతనం రూ.26,000 అమలుపరచాలని, లేబర్‌కోడ్లను వెంటనే రద్దు చేయాలని, సమ్మె హక్కు పోరాడే హక్కును ,భిరసారాల హక్కును,ఎనిమిది గంటల పని విధానాన్ని కాపాడాలని పెద్దపెటునా నినాదాలు చేశారు. కార్యక్రమం లో పాల్గొన్న సిఐటియు సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి,జిల్లా ఉపాధ్యక్షులు వి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్ , రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రాములు,జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలె జగన్, జిల్లా నాయకులు హన్మంతు,ఎం.రాములు, సాయిలు, యాదయ్య,శివలిల,దున్న ఖాదర్, సీఐటీయు నాయకులు చంద్రకాంత్, రాజ్ కుమార్, గాలన్న, తిరుమలయ్య, బుద్దిస్ట్ సమాజ్, జిల్లా నాయకులు బాలకిష్టయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

# పాలమూరు@8 డిగ్రీలు

- ఉమ్మడి జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- నాలుగు జిల్లాల్లో సింగిల్ డిజిట్
- కనిష్ట స్థాయికి టెంపరేచర్
- పొంగమంచుతో ఇబ్బందులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** చలి గాలులు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. పాలమూరును చలిచలి వణుకుతున్నది. గత వారం రోజులగా చలి తీవ్రత అమాంతం పెరగడంతో సాయంత్రం అయిందంటే చలిగాలులకు జనం అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు చేరడంతో ఆందోళన చెందుతున్నారు. వాతావరణం లో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. మహబూబ్నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో సిగింల్ డిజిట్‌కు టెంపరేచర్ పడిపోయింది. పాలమూరులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఏడాది ఇదే నెలలో ఇదే రోజున 14 డిగ్రీలు ఉండగా ఏ యేడాది సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం 4గంటల తర్వాతే చల్లగాలులు వీయడంతో చలితీవ్రత మొదలవుతుంది. ఉమ్మడి జిల్లాలో నారాయణపేట జిల్లాలో 8డిగ్రీలకు పడిపోయింది. ఒక్కసారిగా చలి తీవ్రత పెరగడంతో సాయంత్రం అయ్యిందంటే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. తెల్లవారుజామున చలికితోడు మంచు కురుస్తుండటంతో ఆ సమయంలో పనులు చేసుకునే వారికి తిప్పలు తప్పడం లేదు. పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, మునిసిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్నింగ్ వాకర్స్, అయ్యప్ప భక్తులు, కార్తీక పౌర్ణమి వేళ తెల్లవారుజామునే పూజలు చేసుకునే మహిళలు, బడికి పిల్లలను పంపించే తల్లులు, పేపర్‌బాయ్స్, ప్రయాణం చేసేవారు, డ్రైవర్‌లు చలికి తట్టుకోలేకపోతున్నారు. రానున్న వారం రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. చలికి ప్రజలు స్వెటర్లు, మంకీ క్యాపలు ధరిస్తున్నా రు. నగరంలో ఫుట్‌పాత్‌లపై స్వెటర్ల విక్రయాలు జోరందుకున్నారు. దుకాణాలలో స్వెటర్లకు ఆర్డర్లు పె డుతున్నారు. చలికి చేతులు, కాళ్ల పొడిబారడం, పెదాలు పగులుతుండటంతో కోల్డ్ క్రీ మ్‌లు వినియోగిస్తున్నారు. కప్పుకునేందుకు ఉలన్ రగ్గులు వాడుతున్నారు. ఈ ఏడాది టంపరేచర్ మరింత పడిపోయే అవకాశం ఉందని, చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఓవైపు చలి తీవ్రత జనాలను బెంబేలెత్తిస్తుండగా, మరోవైపు పొగ మంచుతో మరింత ఇబ్బంది పడాల్సి వస్తున్నది. మరి ముఖ్యంగా వాహనదారులు పొగ మంచుతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలు అవుతున్న ప్రధాన రహదారులను పొగ మంచు కమ్మేసి ఉండడంతో ప్రయాణాలు కొనసాగించడం కష్టతరంగా మారింది. ఈ మేరకు మహబూబ్నగర్ ఎస్పీ జానకి వాహనదారులకు పలు సూచనలు సలహాలు అందించారు. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకొని వాహనాలు నడపాలని సూచించారు.



కాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

## పడకేసిన పారిశుద్ధ్యం


- ◆ పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ◆ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ◆ బిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ జహంగీర్



రోడ్డుపై అడ్డంగా ఉన్న మట్టి దిబ్బలు

**వనపర్తి, డిసెంబరు 26 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ బసవన్న గడ్డ 31 వార్డు సమస్యలకు నిలయంగా మారిందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ జహంగీర్ పేర్కొన్నారు. కాలనీలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయిందని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకో వడం లేదు. కాలనీలో చెత్తాచెదారాన్ని తొలగించాలని అడిగితే అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెప్పాలని అంటున్నారని అసహనం వ్యక్తం చేశారు.బసవన్న గడ్డలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అధికారులు స్పందించకుంటే బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు శ్రమదాన కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యాన్ని తొలగిస్తామని తెలిపారు.

## మందుబాబుల అడ్డాగా మారిన కొత్తపల్లి పల్లె ప్రకృతి వనం



**నారాయణపేట, డిసెంబరు 26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కొత్తపల్లి గ్రామంలో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఇప్పుడు ప్రజల విశ్రాంతి కేంద్రంగా కాకుండా మద్యం సేవించే కేంద్రంగా మారిపోయింది. రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు వనం లోపలే తాగి సీసాలు, ప్లాస్టిక్ చెత్త ఎక్కడ పడితే అక్కడ పారేసి అసహ్య కర వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఈ పరిస్థితిని గ్రామస్తులు పలు మార్లు అటవీశాఖ, గ్రామపంచాయతి, పోలీసులకు తెలిపినా ఎవరి నుంచి స్పందన లేదు ప్రజల కోసం నిర్మించిన వనాన్ని చెడు పనులకు వదిలేయడం ఎంత వరకూ సరైంది? అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. వనం చుట్టూ గస్తీ, లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

# పొగమంచుతో జాగ్రత్తలే రక్షణ

### - మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి







**మహబూబ్‌నగర్ క్రైం, డిసెంబరు 26 ప్రభాతవార్త:** చలి కాలం ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు తీవ్రంగా ఏర్పడుతున్న నేపథ్యంలో రోడ్లపై దృష్టి తగ్గడం, ముందున్న వాహనాల దూరం అంచనా కష్టపడడం వంటి ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్నందున, ప్రమాదాలు నివారించడం కోసం డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి సూచించారు. పొగమంచు వలన రోడ్డు, సిగ్నల్స్, పాదచారులు, వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల చిన్న అజాగ్రత్త కూడా పెద్ద ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. అందుకే డ్రైవర్లు ముందుగా బయలుదేరడం, అతివేగాన్ని నివారించడం, లోబీమ్ లైట్లు వాడటం, సురక్షిత దూరం పాటించడం వంటి సూచించిన జాగ్రత్తలు తప్పనిసరిగాపాటించాలన్నారు.ఇవి సూచనలు..పొగమంచు వలన ప్రయాణం ఆలస్యమయ్యే అవకాశం ఉందని ముందుగానే బయలుదేరాలి. అతివేగం, ఓవర్‌టేకింగ్ పూర్తిగా నివారించాలి. హైబీమ్ స్థానంలో లోబీమ్ లైట్లు,ఫాగ్‌లైట్లు ఉపయోగించాలి.ముందున్న వాహనానికి తగినంత సురక్షిత దూరం ఉంచాలి. లేన్ చేంజ్ చేయకుండా నిర్దేశిత లేన్లలోనే ప్రయాణించాలి. కిటికీ అద్దాలను కొద్దిగా దించుకోవడం ద్వారా డ్రైవర్ దృష్టిని మెరుగు పరచాలి.పొగమంచు అధికంగా ఉన్నప్పుడు వాహనాన్ని ఆపి పరిస్థితి సాధా రణం అయిన తర్వాతే ప్రయాణం కొనసాగించాలి. అద్దాలు, వైపర్లు, డిఫ్రాస్టర్లు శుభ్రంగా, సక్రమంగా పనిచేసేలా ఉంచాలి. ముందుగానే ఇండికేటర్లను ఉపయోగించి వెనుకవాహనదారులకు స్పష్టమైన సంకేతం ఇవ్వాలి.సడన్ బ్రేకులు వలన స్కిడ్ అవే ప్రమాదం ఉండేందున బ్రేకులు నెమ్మదిగా అప్లై చేయాలి.జిల్లా ప్రజల ప్రాణాలు, రోడ్డు భద్రత అత్యంత ముఖ్యమని, ప్రతి డ్రైవర్ ఈ సూచనలను ఖచ్చితంగా పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని ఎస్పీ పేర్కొన్నారు.